సాక్షి శ్రీకాకుళం

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



నిధులు లేవుగా..

రాష్ట్ర పండుగకు నిధులు లేవు. కోటమ్మ తల్లి ఉత్సవాల తీరు ఇది.

- IIలో



రైలు ఢీకొని..

రెండు వేర్వేరు చోట్ల రైలు ఢీకొని ఇద్దరు చనిపోయారు. తిలారు, హరిశ్చంద్రపురంలో ఘటనలు జరిగాయి.

- IIలో

పంట దశలో నెల్లూరు సన్నాలు

పాతపట్నం: పాతపట్నం మండలంలోని పాతపట్నం, నల్ల బొంతు, కాగువాడ, కొరసవాడ, సీది, తామర, తీమర తదితర గ్రామాల్లో పలువురు రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో క్యూ–7 రకం నెల్లూరు సన్నాలు సాగుచేశారు. పంట కాలం 90 రోజులు కావడంతో కోత దశకు చేరుకుంది. మరో పక్షం రోజుల్లో పంట కోస్తామని, ఎకరాకు 40 బస్తాలు వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

సచివాలయం ఉద్యోగుల సమ్మె నోటీసు



కలెక్టర్‌ను కలిసిన గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం కలెక్టర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, రాజకీయ, పని ఒత్తిళ్లు తగ్గించాలని కోరారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు సమ్మె నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఉద్యోగులను ద్వితీయ శ్రేణి వ్యవస్థగా మార్చి వారి ఆత్మగౌరవం దెబ్బతీస్తూ తీవ్ర ఒత్తిడికి గురి చేయడం బాధాకరమని అన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉత్తరాంధ్ర సచివాలయ ఉద్యోగుల జేఏసీ కోఆర్డినేటర్‌ కూన వెంకట సత్యనారాయణ, జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్‌ జేఏసీ నాయకులు సంజీవ్‌, శరత్‌ కుమార్‌, చంద్ర మౌళి, సూర్య భరత్‌, సాయి కుమార్‌ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి డాక్యుమెంట్‌ రైటర్ల పెన్‌డౌన్‌



పెన్‌డౌన్‌ చేస్తున్న దస్తావేజు లేఖరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు శుక్రవారం, శనివారం పెన్‌డౌన్‌ నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా డాక్యుమెంట్‌ రైటర్లు పెన్‌డౌన్‌ కార్యక్రమం నిర్వహించారు. డాక్యుమెంట్‌ తయారు చేసినప్పుడు మొదలుకుని అన్ని విభాగాల్లో ఓటీపీ వ్యవస్థ రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. డాక్యుమెంట్‌ ఫీడింగ్‌ చేసినప్పుడే పాన్‌కార్డు, ఆధార్‌కి వెరిఫికేషన్‌తో ఓటీపీలు వస్తున్నాయని, కొంతమంది చదువులేని వారుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో అదనపు పని భారం పెరిగిపోతోందని తెలిపారు. ప్రైమ్‌ 2.0 చేసినప్పుడు, వివరాలు దస్తావేజు లేఖరి నుంచి సబ్‌రిజిస్ట్రార్‌కి వెళ్తున్నాయని అయినా మళ్లీ మళ్లీ ఓటీపీలు వచ్చి ఇబ్బంది పెడుతున్నారన్నారు. స్లాట్‌ బుకింగ్‌లో ఏదైనా కారణం వల్ల హాజరు కాకుంటే యూజర్‌చార్జీ రూ.500 వృథాగా పోతోందన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంట్‌ రైటర్లు కుమార్‌, అన్నెపు సీతారాం, పాత్రో శ్రీనివాసరావు, నల్ల శ్రీను, రాజారావు, మెహర్‌, గోవింద్‌, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్‌



కాలనీ వాసులను భయపెట్టిన కొండ చిలువ

కొత్తూరు: మండలంలోని మహసింగి కాలనీలో గురువారం కొండ చిలువ హల్‌చల్‌ చేసింది. కాలనీలోని పి.సుశీల ఇంటి పెరట ఉన్న పోగుగా ఉన్న కర్రల కింద కొండ చిలువ దాగుంది. సర్పాన్ని చూసిన కాలనీ ప్రజలు భయపడ్డారు. చివరకు సర్పాన్ని పట్టుకుని హడ్డుబంగి గెడ్డలో విడిచిపెట్టారు.

అసంఘటిత కార్మికులకు చట్టపరమైన సేవలు



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: అసంఘటిత రంగంలోని కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం అసంఘటిత రంగ కార్మికులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ రంగంలోని కార్మికులు సాధారణంగా చదువురానివారు, యూనియన్‌లో లేనివారు కావడం వల్ల ఎక్కువగా పథకాల గురించి తెలియడం లేదని తెలిపారు.

ప్రభుత్వం మెడలు వంచే వరకు పోరాటమే..



పార్వతీపురంలోనిర్వహించిన చలో మెడికల్‌ కాలేజీలో పాల్గొన్న మాజీ స్పీకర్‌ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్‌, సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు
- వైఎస్సార్‌ సీపీ విద్యార్థి, యువజన విభాగం 'చలో మెడికల్‌ కాలేజీ లో పాల్గొన్న జిల్లా నాయకులు



సాక్షి, పార్వతీపురం మన్యం: రాష్ట్రంలోని 17 వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ.. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో చలో మెడికల్‌ కాలేజీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోటెత్తాయి. ప్రభుత్వ తీరును నిరసిస్తూ కదం తొక్కాయి. పేదలకు వైద్య విద్యను దూరం చేసే సర్కారు కుటిలత్వాన్ని కడిగి పారేశాయి. జిల్లా నుంచి కూడా నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ..

పార్వతీపురం వైద్యకళాశాలకు అనుబంధంగా ఇక్కడి జిల్లా ఆస్పత్రిని అప్‌గ్రేడ్‌ చేశారని, సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఇదంతా ప్రజలకు చెందాల్సిన ఆస్తి అని, పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న నాలుగు నియోజకవర్గాల్లో మూడు ఎస్టీ, ఒక ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవేనని తెలిపారు. అంతా పేద గిరిజన, దళిత వర్గానికి చెందిన వారేనని, వీరందరికీ కష్టం వస్తే ఎక్కడో ఉన్న కేజీహెచ్‌కు వెళ్లాల్సిందేనని చెప్పారు. వీరికి మంచి చేయాలని జగన్‌ ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలను తీసుకొస్తే.. అది కూడా కబ్జాచేసి, ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు సిద్ధమైన దుర్మార్గ ప్రభుత్వం ఇదని దుయ్యబట్టారు. ఇక్కడున్న గిరిజన శాఖా మంత్రికి ఇది కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. విజయనగరం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను చూస్తే జాలేస్తోందన్నారు. జగన్‌ హయాంలో ఒక్క మెడికల్‌ కాలేజీ కట్టలేదని అంటున్నారని, పార్వతీపురం మెడికల్‌ కాలేజీకి వచ్చి జీఓలు చూడాలని సూచించారు. మంత్రి పదవులు కాపాడుకోవడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, మంత్రులను చంద్రబాబు బ్లాక్‌మెయిల్‌ చేసి, వైఎస్సార్‌సీపీపై విమర్శలకు దిగాలని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ మెడలు వంచే వరకూ మెడికల్‌ కళాశాల పరిరక్షణ ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



నిరసనలో తమ్మినేని, సీదిరితో కలిసి పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రభుత్వానికి పేదల ఉసురు తగులుతుంది



ఆమదాలవలసలో వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న ధర్మాన కృష్ణదాస్‌, మాజీ స్పీకర్‌ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌, వైఎస్సార్‌ సీపీ నాయకులు

- మెడికల్‌ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం చీకటి అధ్యాయం
- మాజీ స్పీకర్‌ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: పేదవాడికి వైద్య విద్యను దూరం చేయడం ప్రభుత్వానికి తగదని, పేదల ఉసురు చంద్రబాబు ప్రభుత్వానికి తగలక మానదని మాజీ స్పీకర్‌ తమ్మినేని సీతారాం అన్నారు. చలో మెడికల్‌ కాలేజీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్వతీపురంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి జిల్లా యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా నుంచి పెద్ద ఎత్తున బయల్దేరారు. నేతలంతా ఒకచోట చేరిన సమయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌ ఆధ్వర్యంలో నేతలు మాట్లాడారు. మాజీ స్పీకర్‌ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ పేదల పొట్టకొట్టడం చంద్రబాబునాయుడికి వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. ఆదాయ అన్వేషణలో విద్య, వైద్యాన్ని కూడా ప్రైవేటుకు తాకట్టు పెట్టడం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్‌ కాలేజీలు ప్రైవేటు పరం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పేదలకు అండగా వైఎస్‌ జగన్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉంటారని తెలిపారు.

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ చంద్రబాబు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముడుపోయారని విమర్శించారు. అందుకే అన్ని రంగాలను ప్రైవేటుపరం చేసేందుకు పావులు కదుపుతున్నారని పేర్కొన్నారు. అంతకుముందు ఆమదాలవలస పట్టణంలోని ఓవర్‌ బ్రిడ్జి డౌన్‌లోగల డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ మెడికల్‌ కళాశాలను ప్రైవేటుపరం చేసే విధానాన్ని వ్యతిరేకిస్తూ మన్యం జిల్లా(పార్వతీపురం)మెడికల్‌ కళాశాలను సందర్శించారు.

మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్‌, పార్టీ రాష్ట్ర కళింగ కుల అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్‌)దుంపల లక్ష్మణరావు, తూర్పు కాపు విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్‌, రాష్ట్ర వెలమ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మెంటాడ స్వరూప్‌, రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యామ్‌ ప్రసాద్‌ రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్‌, గుమ్మడి రాంబాబు, ఇంటలెక్చువల్‌ ఫామ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల రామకృష్ణ, ధర్మాన రామ్‌ మనోహర్‌ నాయుడు, కోట గోవిందరావు, జిల్లా యువజన అధ్యక్షుడు మార్పు పృథ్వీ, ముత్తాడ విజయ్‌ కుమార్‌, జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు, ముఖ్యనాయకులు పిన్నింటి సాయి కుమార్‌, గేదెల పురుషోత్తం, రౌతు శంకర రావు, సీపాన రామారావు, బొడ్డేపల్లి నారాయణరావు, దుంపల శ్యామల రావు, టొంపల సీతారాం, రామకృష్ణ, కూన రామకృష్ణ, సిస్టు గోపి, చిన్ని జోగారావు, కామేశ్వరి, మామిడి కిరణ్‌, అత్తులూరి రవికాంత్‌, బొడ్డేపల్లి నారాయణరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరావు, మామిడి కిరణ్‌, పొన్నాడ చిన్నారావు, చిన్ని జోగారావు, తంగి అప్పన్న తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి



సామూహిక ప్రవేశాల ఆనందంలో పిల్లలు, అధికారులు, గ్రామస్తులు

- ఊరి బడికి ఊపిరి పోసిన గ్రామస్తులు
- సర్కారు సాయం కోసం ఎదురుచూపులు

కవిటి: మండలంలోని దూగాన పుట్టుగ వాసులు ఊరి బడికి ఊపిరి పోశారు. ప్రభుత్వ పోకడలతో ఈ బడి ఉనికే ప్రశ్నార్థకమైన వేళ పిల్లలందరినీ తీసుకువచ్చి బడిలో చేర్చి మళ్లీ పాత వైభవాన్ని తీసుకువచ్చారు. గ్రామస్తులు ఎంత చేసినా ప్రభుత్వ సాయం అందకపోతే బడి పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుంది. వివరాల్లోకి వెళితే..

దూగానపుట్టుగలో ప్రాథమిక పాఠశాల ఒకప్పుడు అప్పర్‌ ప్రైమరీ బడిగా ఉండేది. 6,7 తరగతులు సమీపంలోని పాఠశాలలో కలిపేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలగా మిగిలిపోయింది. దీని కొనసాగింపు కూడా ప్రశ్నార్థకమైంది. ఈ దశలో ఊరివారంతా సమావేశమయ్యారు. బడిని కాపాడుకోవాలనే లక్ష్యంతో ప్రైవేటు పాఠశాలల నుంచి పిల్లలను తీసుకువచ్చి ఈ బడిలో జాయిన్‌ చేశారు. ఒకేసారి 40 మంది చేరడంతో బడిలో పిల్లల సంఖ్య 59 కు చేరుకుంది. ఇంత మంది పిల్లలు ఉంటే నిబంధనల ప్రకారం దీన్ని మోడల్‌ ప్రైమరీ స్కూల్‌గా గుర్తించాలి. బేసిక్‌ ప్రైమరీ స్కూల్‌ అయితే ముగ్గురు ఉపాధ్యాయులు, మోడల్‌ ప్రైమరీ స్కూల్‌ అయితే ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ఇది ఇప్పటికీ ఏకోపాధ్యాయ పాఠశాలగానే ఉంది. ఒక్క ఉపాధ్యాయుడు కూడా ఇటీవల బదిలీల్లో వేరే ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్‌ అయ్యారు. కానీ ఉపాధ్యాయుడు వచ్చినంత వరకు ఆయన ఇక్కడే ఉండాలి.

టీచర్‌ ఒక్కడే కావడంతో గ్రామస్తుల ఔదార్యంతో ముగ్గురు వలంటీర్లను నియమించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ సమయానికి ఈ బడిలో ఉన్న పిల్లల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే కేవలం ఒక్క టీచర్‌ పోస్టు మాత్రమే కేటాయించే వీలుంది. ప్రస్తుతం ఉన్న 59 మందికి ఆ ఒక్క ఉపాధ్యాయుడు సరిపోడు. మోడల్‌ ప్రైమరీ స్కూల్‌ అర్హత ఉన్న ఈ స్కూల్‌కు నలుగురు ఎస్‌జీటీలతో పాటు ఓ హెచ్‌ఎం ఉండాలి.ఆ గుర్తింపు రాకుంటే పిల్లలు నష్టపోతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఈ బడిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

టీచర్‌ను నియమించాలి



ఈ బడిని కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రైవేటు బడుల్లో ఉన్న పిల్లలను ఇక్కడకు తీసుకుచ్చాం. ఉపాధ్యాయుల్ని నియమించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదే.

– దూగాన భద్రాచలం, సర్పంచ్‌, దూగానపుట్టుగ

అయిన వారికే యూరియా!



యూరియా కోసం కొళిగాం రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

ఇచ్ఛాపురం రూరల్‌: యూరియా అధికార పార్టీ వారికి, వారికి అయిన వారికి మాత్రమే దక్కుతోందని కొళిగాం, కీర్తిపురం, పాయితారి, బొడ్డబడ పంచాయతీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత వచ్చిన యూరియాను శుక్రవారం కొళిగాం రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేస్తుండటంతో వందలాది మంది రైతులు అక్కడకు చేరుకున్నారు. అయితే గతంలో యూరియాను తీసుకువెళ్లిన వారే మళ్లీ పేర్లు మార్చి తీసుకువెళ్తున్నారని, కూటమి నాయకులు ఆధ్వర్యంలో పంపిణీ జరుగుతుండటంతో తమకు అన్యాయం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

తోపులాట



పలాస: టిక్కలిపట్నం సచివాలయం శుక్రవారం యూరియా పంపిణీ వద్ద తోపులాట జరిగింది. గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


హైవే పెట్రోలింగ్‌ వాహనాలను తనిఖీ చేసిన ఎస్పీ



హైవే పెట్రోలింగ్‌ వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్‌ : శ్రీకాకుళం నుంచి కాశీబుగ్గ జాతీయ రహదారి–16 మార్గమధ్యంలో ఉన్న హైవే పెట్రోలింగ్‌ వాహనాలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. నిరంతర వాహన తనిఖీలు చేయాలని, అనుమానాస్పద వాహనాలు, మద్యం సేవించి నడిపేవారిని, నిబంధనలు ఉల్లంఘించేవారిని, గంజాయి, పశువులు అక్రమ రవాణా చేసే వాహనాలను గుర్తించి ఆ పరిధి స్టేషన్‌ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా లారీలు, ఇతర భారీ వాహనాలు పార్కింగ్‌ లేకుండా చూడాలని, రాంగ్‌ రూట్‌లో వచ్చే వాహనాలను నియంత్రించాలన్నారు. వేకువజామున టోల్‌ప్లాజా, చెక్‌పోస్టుల వద్ద చోదకులకు ఫేస్‌వాష్‌ చేయించాలన్నారు.

మందుబాబులకు సుఖీభవ.. అన్నదాతలకు దుఃఖీభవ



- కూటమి ప్రభుత్వంలో వింత పరిస్థితి
- వైన్‌షాపులు, పర్మిట్‌ రూమ్‌లు, బెల్ట్‌షాపులతో మద్యం ప్రవాహం
- ఇంటికే మద్యం తెచ్చే ప్రయత్నాలు
- క్యూ కట్టి నించున్నా ఎరువులు మాత్రం ఇవ్వని దుస్థితి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లాలో వింత పరిస్థితి నడుస్తోంది. పేదల కుటుంబాలను నాశనం చేసే మద్యం ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడ కావాలంటే అక్కడ, ఎంత కావాలంటే అంత దొరుకుతోంది. ప్రభుత్వం దగ్గరుండి మరీ పర్మిట్‌ రూమ్‌లకు అనుమతి ఇచ్చింది. కానీ ఎరువు కావాలంటే మాత్రం నానా యాతన పడాల్సి వస్తోంది. గంటల కొద్దీ క్యూలో నిలబడినా బస్తా ఎరువు సర్కారు ఇవ్వలేకపోతోంది. పొలంలో పనులన్నీ మానుకుని చీటీల కోసం ఓ రోజు, ఎరువు కోసం మరో రోజు నిలబడినా దొరుకుతుందన్న గ్యారెంటీ లేకుండాపోయింది. ఈ రెండింటిలోనూ అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్న వైనాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు యూరియాను పక్కదారి పట్టించి, బ్లాక్‌లో అమ్ముకుని లబ్ధి పొందుతుండగా, మరోవైపు ఎంఆర్‌పీకి మించి మద్యాన్ని అమ్ముతూ, ముడుపులు తీసుకుంటూ కోట్లలో ఆర్జిస్తున్నారు.

సంపాదనే ధ్యేయం..

రైతుల సమస్యలు, ప్రజల ఆరోగ్యం కూటమి ప్రభుత్వానికి, పాలకులకు పట్టడం లేదు. గుడి, బడి తేడా లేకుండా మద్యం షాపులు పెట్టి, పర్మిట్‌ రూమ్‌లను ప్రోత్సహించి, బెల్ట్‌షాపులు నడిపి ఫుల్‌గా జనాల్ని తాగిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసి దాని ముసుగులో ఎంఆర్‌పీకి మించి విక్రయాలు, నెల వారీ ముడుపులు తీసుకుని రూ.కోట్లకు పడగలెత్తున్నారు. టార్గెట్‌లు పెట్టి, ఇంటికి దగ్గరలో సరఫరా చేసి మద్యం విక్రయాలను భారీగా పెంచుతున్నారు. ఏడాది కాలంలో 14లక్షలకు పైగా ఇండియన్‌ మేడ్‌ లిక్కర్‌ కేసులు, 4లక్షల 59వేల 81బీరు కేసులు విక్రయాలు జరిగాయంటే ఏ స్థాయిలో అమ్మకాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు.

రైతులపై శ్రద్ధ ఏదీ..?

ప్రభుత్వం మద్యం అమ్మకాలు, లాభాలు, ముడుపులపై చూపించిన శ్రద్ధ రైతులపై చూపించలేదు. యూరియా కొరత జిల్లాలో తీవ్రంగా ఉన్నా సంబంధిత ప్రజాప్రతినిధులు కనీసం నియోజకవర్గాల వారీగా సమీక్షలు కూడా చేయలేదు. అరకొర యూరియా సరఫరా చేసి తాంబూలం ఇచ్చాం తన్నుకు చావండి అన్నట్లు రైతులను క్యూలలో వదిలేశారు.

జిల్లాలో 3,68,057మంది రైతులు ఉన్నారు. వరి, చెరుకు, మొక్కజొన్న, ప్రత్తి, పెసర, కంది తదితర పంటలు 4లక్షల ఒక వెయ్యి 472ఎకరాల్లో సాగుతున్నట్టు అధికారికంగా చూపించారు. ఇక, తోట పంటలైతే మరో లక్షా 20వేల వరకు వరకు ఉన్నాయి. వీటిన్నింటికీ 50వేల మెట్రిక్‌ టన్నులకు యూరియా అవసరం ఉంది. కానీ, ప్రభుత్వం చెప్పే చెడీ సెప్టెంబర్‌ 19వ తేదీ నాటికి 30,646 మెట్రిక్‌ టన్నులు సరఫరా చేసినట్టు చెబుతోంది. కానీ ఇంకా రైతులు యూరియా కోసం పాట్లు పడుతున్నారు. క్యూలలో పడిగాపులు కాస్తున్నారు. ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని తిడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యంతో అరకొర యూరియా వచ్చిందనుకుంటే దాన్ని కూడా పక్కదారి పట్టించి, బ్లాక్‌లో విక్రయించుకున్నారు. ఒక్కో నాయకుడు ఎంత దాచుకున్నారో విలేజ్‌ అగ్రికల్చరల్‌ అసిస్టెంట్లే తేటతెల్లం చేశారు. మండల పరిషత్‌ సమావేశాల్లోనైతే ప్రతి పక్షాల సభ్యులు ఏకంగా నిలదీశారు.

మందు దొరుకుతోంది.. ఎరువు లేదు



ఊరూరికీ బ్రాందీ దొరుకుతోంది. కానీ యూరియా మాత్రం దొరకడం లేదు. గతంలో రైతులకు ఎరువుల సమస్య లేదు. ఇప్పుడు రెండు బస్తాల కోసం కాళ్లరిగేలా తిరిగినా దొరకడం లేదు. రెండు ఎకరాల భూమికి కౌలుకు చేస్తున్నాను. రైతు సేవా కేంద్రానికి తిరిగినా ఒక్క బస్తా కూడా ఇవ్వలేదు.

– అంతర్యామి బిసాయి, కౌలు రైతు, బోరివంక, కవిటి మండలం.

అన్నదాతకు ఎరువు నరకం



నాకు 7ఎకరాలు భూమి ఉంది. ఏటా సుమారు 10బస్తాల వరకు యూరియా పొలంలో వాడేవాళ్లం. ఈ ఏడాది ఒక బస్తా యూరియా కోసం ఎన్నో పాట్లు పడ్డాం. ప్రతి ఊరినీ నాశనం చేయడానికి మద్యం సరఫరా చేస్తున్నారు. కానీ, అన్నదాతకు ఒక యూరియా బస్తా కోసం ప్రభుత్వం నరకం చూపుతోంది.

– బూటు అప్పారావు, బాతువ, జి.సిగడాం మండలం.

ఉరివేసుకుని చనిపోవాలా



ఈ ఊరిలో పుట్టి.. ఈ ఊరిలో పెరిగి.. ఈ ఊరిలో సచ్చేవోళ్లం. అలాంటిది మాకు యూరియా లేదంటే ఇక్కడే ఉరి వేసుకుని సచ్చిపోవాలా? పంచాయతీలో ఉన్న గ్రామం మాది. మాకు యూరియా ఇవ్వనంటున్నారు. ఓట్లు కావాలని మా ఊరు వచ్చేస్తారు. ఉరి వేసుకుని చస్తే అప్పుడు తెలుస్తుంది.

– సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ కూర్మనాథపురం గ్రామంలో శుక్రవారం యూరియా పంపిణీలో టీడీపీ కార్యకర్త, రైతు గిరి ఆవేదన ఇది.

క్లుప్తంగా

మండల స్థాయిలో సబ్జెక్ట్ కాంప్లెక్స్ నిర్వహించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం: జిల్లాలో సబ్జెక్టు కాంప్లెక్స్‌ను మండల స్థాయిలో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి రవి బాబుకు వినతిపత్రం అందజేశారు. క్లస్టర్ స్థాయిలో సబ్జెక్టు కాంప్లెక్స్ నిర్వహించడం వల్ల ఇద్దరు నుంచి ముగ్గురు మాత్రమే సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యా విషయాలపై చర్చించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మండల స్థాయిలో నిర్వహిస్తే ఎక్కువ సంఖ్యలో చర్చించుకునేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. 2025 పదో తరగతి మూల్యాంకనానికి సంబంధించిన రెమ్యూనరేషన్లను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరాం ప్రసాద్, జి.చిన్నికృష్ణ, ఎస్.రాజు, బి.జి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



విజయలక్ష్మి

శ్రీకాకుళం కల్చరల్ : ఇచ్ఛాపురం మెజిస్ట్రేట్ పెదసింగు పరేష్‌కుమార్ అమ్మమ్మ విజయలక్ష్మి (100) అనారోగ్యం కారణంగా శుక్రవారం మృతి చెందారు. ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో నేత్రదానానికి మెజిస్ట్రేట్ పరేష్‌కుమార్, సీహెచ్.సురేష్, ఎం.ఢిల్లీరావులు ముందుకువచ్చారు. భౌతికకాయాన్ని స్వగ్రామం మచిలీపట్నానికి తరలించే ముందు విషయాన్ని ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ దేవేంద్రర్‌రెడ్డి రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, చిన్ని కృష్ణలు శ్రీకాకుళం వద్ద ఆమె కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సభ్యులు దుర్గా శ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబరుకు తెలియజేయాలని కోరారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తాం



వినతులు స్వీకరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి వినతులు స్వీకరించారు. 40 వినతులు రాగా.. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, హ్యాండ్ స్టిక్కులు, వినికిడి యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జెడ్పీ సీఈఓ, దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఎ.డి. శ్రీధర్ రాజా, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోరుకు సిద్ధం



రన్నింగ్‌ట్రాక్‌పై మార్కింగ్ వేయిస్తున్న పీడీ, పీఈటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం వేదికగా శనివారం జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరగనున్నాయి. డివిజన్ స్థాయిలో అండర్-14, 17, 19 విభాగాల్లో ఎంపికైన బాలబాలికలు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరికి వేర్వేరుగా రన్స్, త్రోస్, జంప్స్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ అధికారుల నేతృత్వంలో రన్నింగ్ ట్రాక్, ఇతర కోర్టులను సిద్ధం చేసి తుది మెరుగులు దిద్దారు. బేస్‌బాల్ ఎంపికలు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో భాగంగా మొదటిరోజు శుక్రవారం సాఫ్ట్‌బాల్ అండర్-14,17,19 వయో విభాగాల్లో ఎంపికలను పూర్తిచేశారు. మరోవైపు, పతకాలే లక్ష్యంగా క్రీడాకారులు ముమ్మరంగా సాధన చేస్తున్నారు.

మీడియా స్వేచ్ఛను హరించడమే



ప్రభుత్వ తీరుపై వార్తలు రాస్తే 'సాక్షి' కార్యాలయాలపై దాడులు చేయడం, ఏకంగా ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసు నమోదు చేయడం సరికాదు. ఇది పూర్తిగా మీడియా స్వేచ్ఛను హరించడమే. సమాజ హితం కోసం నిజాలు రాస్తే పోలీసులతో అక్రమ కేసు పెట్టించడం గతంలో ఏ ప్రభుత్వాల్లోనూ జరగలేదు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలి. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి.

– సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి



ఎమర్జెన్సీ తలపిస్తోంది



అన్యాయాలను, అవినీతిని ప్రశ్నిస్తూ పత్రికల్లో కథనాలు రాస్తే కూటమి ప్రభుత్వం కక్ష కట్టడం ఎమర్జెన్సీ తలపిస్తోంది. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి మీద కేసులు పెట్టించడం చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని ఎలా ఖూనీ చేస్తున్నారో అర్థమవుతుంది.

– ప్రత్తి అన్వేష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర పండుగ నిధులు లేవుగా!



కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి ఆలయం

- ఒక్క రూపాయి కూడా విదల్చని సర్కార్
- కొత్తమ్మతల్లి సంబరాల భారం మళ్లీ అరసవల్లికే..
- ఆదిత్యుని నిధులతోనే పట్టువస్త్రాల సమర్పణ

అరసవల్లి: కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలపై పెడుతున్న శ్రద్ధ నిధులు మంజూరు చేయడంలో చూపించడం లేదు. జిల్లాలో గత ఏడాది నుంచి రథసప్తమితో పాటు కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి అమ్మవారి సంబరాల ఉత్సవాలను రాష్ట్ర పండుగలంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చడం లేదు. రాష్ట్ర పండుగలంటూ ప్రకటనలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రచారాలకు దిగుతున్నారు తప్ప ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం ఇవ్వడం లేదు. ప్రత్యేకంగా నిధులివ్వం.. సమీపంలో ఉన్న పెద్ద ఆలయాల నిధులను వెచ్చించి పండుగ చేస్కోండి..' అంటూ అధికారిక ఉత్తర్వులు మాత్రం జారీ అయ్యాయి. గతేడాది లాగానే ఈ ఏడాది కూడా కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి అమ్మవారి సంబరాలు అందునా.. శతాబ్ది సంబరాల పేరిట ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఎలాంటి ఆర్థిక సహకారం ఉండదని తేల్చేసింది. దీంతో పేరు గొప్ప..ఊరు దిబ్బ అన్నట్లుగా సర్కార్ తీరుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుంటే ఈఏడాది రథసప్తమి మహోత్సవాలను కూడా తొలిసారిగా రాష్ట్ర పండుగ చేస్తున్నామని ప్రకటించి ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం విడుదల చేయలేదు. రాష్ట్ర పండుగ అంటూ..అలాగే 'ప్రసాద్' స్కాం వచ్చేస్తుందంటూ...ఆలయ పరిసరాల్లో ఉన్న అన్ని కట్టడాలను కూల్చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అరసవల్లి ఆలయ పరిసరాలన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

మళ్లీ అరసవల్లి నుంచే..

రాష్ట్ర పండుగంటూ కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయ శతాబ్ది సంబరాలను నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్రం నుంచి ఆర్థిక సహకారం లేకపోవడంతో గౌరవ సాంప్రదాయాల భారమంతా అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ నిధులపై పడింది. గత ఏడాది కూడా ఇలాగే అరసవల్లి నుంచే సంప్రదాయక ఖర్చులన్నీ వెచ్చించింది. మళ్లీ ఇప్పుడు కూడా ఈ కొత్తమ్మతల్లి సంబరాల ప్రారంభ ఖర్చు, సంప్రదాయక ప్రక్రియలు, పట్టువస్త్రాలు, ప్రసాదాల ఖర్చు అంతా అరసవల్లి ఆలయంపైనే పడనుంది. అరసవల్లి ఆలయ డిప్యూటీ కమిషనర్/ఈఓ కె.ఎస్.వి.డి.వి. ప్రసాద్‌ను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా నియమించి కొత్తమ్మతల్లి అమ్మవారి సంబరాల ప్రారంభ రోజున సంప్రదాయక ఉత్సవ నిర్వహణ, ప్రోటోకాల్‌తో పాటు పట్టువస్త్రాల సమర్పణ, గౌరవ లాంఛనాలు, ప్రసాదాల భారమంతా ఆదిత్యాలయ నిధుల నుంచే ఖర్చు చేయనున్నారు. రాష్ట్ర పండుగలంటూ నిధులివ్వకపోవడంపై గతేడాది కొత్తమ్మతల్లి సంబరాల నుంచి కూడా జిల్లా వ్యాప్తంగా చర్చ సాగుతోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టు వస్త్రాలు అందిస్తున్నాం..



కొత్తమ్మతల్లి ఉత్సవాలకు ఈ ఏడాది కూడా అరసవల్లి నుంచి పట్టు వస్త్రాలు, ప్రసాదాలను అమ్మవారికి సమర్పించనున్నాం. రాష్ట్ర పండుగగా కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చర్యలు చేపడుతున్నాం.

– కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, ఈఓ, సూర్యనారాయణ స్వామి ఆలయం, అరసవల్లి

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని మృతదేహం

జలుమూరు: తిలారు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 70 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామని చెప్పారు. వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీస్‌లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

రైలుపట్టాలపై మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురం రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతుడు కాలికి కట్టు కట్టి ఉందని, నీలం షర్ట్, పంచె ధరించాడని చెప్పారు. ప్రమాదవశాత్తు జరిగిందా.. మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 9492250069 నంబర్‌కు తెలియజేయాలని పలాస జీఆర్‌పీ హెచ్‌సీ ఎం.సోమేశ్వరరావు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సారవకోట: నౌతళ గ్రామానికి చెందిన వాడారి అప్పన్న(49) పురుగు మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడారి అప్పన్న మద్యానికి బానిస కావడంతో భార్య అన్నపూర్ణ వద్దని వారించేది. ఈ క్రమంలో భార్యాభర్తలు శుక్రవారం గొడవపడ్డారు. వెంటనే అప్పన్న నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి పాతపట్నం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు. అప్పన్నకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



కర్రి నాగరాజు(ఫైల్)

ఇచ్ఛాపురం :అప్పుల బాధ భరించలేక ఇచ్ఛాపురంలోని 17వ వార్డు సంతపేటకు చెందిన కర్రి నాగరాజు(42) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజు గతంలో లారీ ట్రాన్స్‌పోర్టు వ్యాపారం నిర్వహించేవాడు. వ్యాపారంలో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోవడంతో లారీలు అమ్మేశాడు. అయినా అప్పులు తీరకపోవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం తన ఇంటి మేడపైన గదిలోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజుకు భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ముకుందరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జయిన లారీ

మందస: భిన్నాళి-మదనాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న హైవే వాహనాన్ని లారీ (సిమెంట్ మిక్సింగ్ ట్యాంకర్) ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ శిబిరాం జినా(34) తీవ్ర గాయాలపాలవ్వడంతో హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. లారీ యలమంచిలి నుంచి బరంపురం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

బారువలో అగ్ని ప్రమాదం



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న అగ్నిమాపకాధికారి

సోంపేట : బారువ కుమ్మరిపేట వీధిలో తెప్పల ముకుందరావు ఇంట్లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అనుమానిస్తున్నారు. సోంపేట అగ్నిమాపక శాఖాధికారి సూర్యారావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో రూ.నాలుగు లక్షల యాభై వేల విలువైన వస్తువులు కాలిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం



రిలే దీక్షలు చేపడుతున్న విద్యుత్ ఉద్యోగులు

- రిలే దీక్షలకు దిగిన విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

అరసవల్లి: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు తక్షణమే చర్యలు చేపట్టాలని, లేదంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని విద్యుత్ ఉద్యోగులు హెచ్చరించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను ప్లకార్డుల ద్వారా ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థలు మొండివైఖరి వీడి విద్యుత్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శనివారం కూడా రిలే దీక్షలను కొనసాగిస్తామని జేఏసీ నేతలు ప్రకటించారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు రమేష్, సుబ్రహ్మణ్యం, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నతో ఇథనాల్ ఉత్పత్తి



మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సుధీర్

రణస్థలం: మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా సాగు చేసే రైతుల ఆదాయం మెరుగుపడుతుందని పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్ అన్నారు. లావేరు గ్రామంలో పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం, పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కజొన్న రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఇంధన అవసరాల దృష్ట్యా మొక్కజొన్న వంటి పునరుత్పాదక వనరులతో ఇంధనం ఉత్పత్తి చేస్తే పర్యావరణానికి మేలు కలగడమే కాక, మొక్కజొన్నకు డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతాయని చెప్పారు. మొక్కజొన్న విత్తే సమయంలో ఎరువులు వేయడం లేదని, శాస్త్రవేత్తల సిఫారసు మేరకు ఎరువుల వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అయితే మోతాదుకు మించి నత్రజని ఎరువులు వినియోగిస్తే సాగు ఖర్చులు పెరగడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. మొక్కజొన్న పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూ సారం క్షీణిస్తుందని, దానికి బదులు పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు, సీనియర్ మేనేజర్ పి.తవిటినాయుడు, పెద్దాపురం పరిశోధన స్థానం సిబ్బంది హఫీజా, సమన్వయకర్తలు ఎస్.సాయి దుర్గ, ఐ.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

టెక్కలిపాడులో చైన్‌స్నాచింగ్

జలుమూరు: టెక్కలిపాడులో శుక్రవారం చైన్‌స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన జలుమూరు ఎర్రమ్మ గ్రామ శివారులో దుస్తులు ఉతుకుతుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు తాడును తెంచుకుని నరసన్నపేట వైపు వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయం కావడంతో ఎవరూ లేరని, కేకలు పెట్టినా ఫలితం లేకపోయిందని బాధితురాలు వాపోయింది. జలుమూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు బాధితురాలు తెలిపింది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎస్.వై.నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి ఎస్.వై.నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.నూకరాజు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా 7వ మహాసభలు శుక్రవారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. మున్సిపల్ రంగంలో రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించి మరణించిన జి.సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, సమ్మెకాలపు జీతం చెల్లించేలా జీఓ జారీచేయాలని, జీతం పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.తేజేశ్వరరావు, అధ్యక్షుడిగా డి.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్.బలరాం, ఉపాధ్యక్షులుగా రమేష్ పట్నాయక్, ఎ.గణేష్, సహాయ కార్యదర్శులుగా మురుగన్, పి.ఢిల్లీ, కోశాధికారిగా టి.సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.శంకర్ గణేష్, ఎ.మోహన్, కమిటీ మెంబర్లుగా ఎ.దేవసంతోష్, ఎ.రాజేష్, బి.సరోజ, ఎ.రాజేశ్వరి, జె.మాధవి, హరీష్, తారక, రాజేష్, భాస్కర్, కె.రవి, కె.రాజేశ్వరి, ఎ.రాము, ఎం.రాఘవ, ఎ.జ్యోతిప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


అంబేడ్కర్ వర్సిటీకి గ్రీన్ ఆడిట్ గుర్తింపు



గుర్తింపు పత్రాలతో వర్సిటీ వీసీ, సిబ్బంది

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి మొదటిసారి గ్రీన్ ఆడిట్ గుర్తింపు లభించింది. ఈ మేరకు జీసీ కన్సల్టెంట్ సర్వీసెస్ (గోరఖ్‌పూర్-ఉత్తరప్రదేశ్) వర్సిటీకి సమాచారం అందజేసింది. వచ్చే ఏడాది నాక్ పరిశీలనకు సన్నద్ధమవుతున్న అంబేడ్కర్ వర్సిటీ పలు గుర్తింపుల కోసం ప్రయతిస్తోంది. అందులో భాగంగా జీసీ కన్సల్టెంట్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ విశాశ్ శ్రీవాత్సవ్ నేతృత్వంలోని బృందం ఈ ఏడాది జూలై 22, 23 తేదీల్లో క్యాంపస్‌లో పర్యటించి వర్సిటీలోని బోధన, పరిపాలన, పరిశోధన, సేవలు, సౌకర్యాలు, పర్యావరణ సంబంధిత అంశాలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు వర్సిటీ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను ప్రశంసిస్తూ గ్రీన్ ఆడిట్ యూనివర్సిటీగా గుర్తింపునిచ్చారు. అదే విధంగా, క్వాలిటీ, ఎన్విరాన్‌మెంట్, ఎనర్జీ, ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్స్, మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కేటగిరీల్లో 2025 విద్యాసంవత్సరానికి ఐఎస్‌ఓ గుర్తింపునిస్తూ సర్టిఫికెట్ సైతం జారీచేశారు. వర్సిటీ ఐక్యూఏసీ విభాగం ఈ పర్యటనను పర్యవేక్షించి వారికి అవసరమైన పూర్తిస్థాయి సమాచారం అందజేశారు. కాగా వర్సిటీ ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రెడ్డి తిరుపతిరావు, సభ్యులు ఎన్.శ్రీనివాస్, జి.కిరణ్‌కుమార్, పి.మాధవరావులను వర్సిటీ వైస్ చాన్సలర్ కె.ఆర్.రజినీ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. నాక్ గుర్తింపు మరోసారి పొందేందుకు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఆయా విభాగాలు పూర్తి సమాచారంతో సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, అకడమిక్ అఫైర్స్ డీన్ కె.స్వప్నవాహిని, ఎస్‌ఓ కె.సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జయకేతనం ఎగురవేసి జిల్లా కీర్తిప్రతిష్ఠతలను చాటిచెప్పాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు శుక్రవారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి రికార్డుస్థాయిలో 300 మంది వరకు బాలబాలికలు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం సమీపంలోని కె.డి.పాలెం వేదికగా అక్టోబర్ 4 నుంచి 6వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి బాలబాలికల సబ్-జూనియర్స్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు జరగనున్నాయని సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, పీఈటీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ తెలిపారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వి.రమణ, కె.మాధవరావు, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్‌కుమార్, ఎం.ఆనంద్ కిరణ్, అన్నెపు రాజగోపాల్, ఎ.డిల్లేశ్వరరావు, పెంటయ్య, పి.రమేష్, ఎస్వీ రమణ, మహంతి, మల్లేశ్వరరావు, తోటారావు, మోహనబాబు, ఐ.గౌరి, వెంకటరమణ, నాగు, హరికృష్ణ, అఖిల్, పీడీ పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సత్తాచాటిన సత్యవరం విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నరసన్నపేట: సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగిన గట్కా పోటీ(యుద్ధ విద్య) లో సత్తా చాటారు. 23 మంది విద్యార్థులు హాజరుకాగా, 8 మంది స్వర్ణ పతకాలు, 12 మందికి రజత పతకాలు, మరో ముగ్గురికి కాంస్య పథకాలు వచ్చాయని హెచ్‌ఎం వకులా రత్నమాల తెలిపారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. విజయవాడలోని ఆంధ్రా లయాలా కళాశాల్లో ఈ నెల 13, 14 తేదీల్లో ఈ పోటీలు జరిగాయన్నారు. వీరిని శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, ఎంఈఓ దాలినాయుడు, విద్యా కమిటీ చైర్మన్ శాంతా నాగరాజులు అభినందించారు.

నేడు 'తీర పరిశుభ్రత'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం – 2025లో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు పెదగనగల్లపేట బీచ్ వద్ద పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ కరుణశ్రీ శుక్రవారం తెలిపారు. 'సేవా పర్వ్-2025'లో భాగంగా తీర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడమే కాకుండా సముద్ర పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. బీట్ ప్లాస్టిక్ నినాదంతో జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మొక్కలు నాటడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతని సందేశాన్ని ఇచ్చేందుకు 'స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర' పథకాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.